
సాక్షి ఒడిశా

శనివారం । 1 । జూన్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 4,48,003
బంగారం: 15 గ్రాముల 250 మిల్లీ గ్రాములు
వెండి: 59 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ఆకట్టుకున్న ఆయుధ ప్రదర్శన

జయపురంలోని విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బీఎస్‌ఎఫ్ బెటాలియన్ అధికారులు ఏర్పాటు చేసిన యుద్ధ ఆయుధాలు, పరికరాలు ఆకట్టుకుంటున్నాయి. - 10లో



శరవేగంగా రామసాగరం పనులు

ఉప్పలాడ పంచాయతీ జాజిపురం వద్ద రామ సాగరం పునరుద్ధరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటివరకూ 60 శాతం మట్టి వెలికితీత పనులు పూర్తయ్యాయి. - 10లో

న్యూస్‌రీల్

లైసెన్స్ లేకుండా ఎరువులు విక్రయిస్తే చర్యలు

జయపురం: లైసెన్స్ లేకుండా ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ సంబంధిత సామగ్రి విక్రయించే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని పలువురు వ్యాపారులు నిర్ణయించారు. తెలిగుడ గ్రామంలో శుక్రవారం జయపురం సబ్ డివిజన్ పరిధిలోని లైసెన్స్‌డ్ వ్యాపారుల సమావేశం సంఘ అధ్యక్షుడు ఉపేంద్రకుమార్ పాణిగ్రహి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పుట్ట గొడుగుల్లా వ్యాపారులు వచ్చి ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల దుకాణాలు తెరచి లైసెన్స్ లేకుండా నకిలీ ఎరువులు అమ్ముతున్నారని చెప్పారు. దీంతో లైసెన్స్‌డ్ వ్యాపారులకు చెడ్డ పేరు వస్తోందన్నారు. ఈ విషయంలో వ్యవసాయ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కె.సుధీర్, కార్యదర్శి జితేంద్రకుమార్ పాడి, సహాయ కార్యదర్శి సంజయకుమార్ పాత్రొ, కోశాధికారి ఎ.ఈశ్వరరావు, అడ్వైజర్ ఎం.శ్రీరామమూర్తి, ఉమాకాంత సాహు, దేవీ ప్రసాద్ మహంతి, బినోద్‌కుమార్ మహంతి, దినేష్ కుమార్ మహంతి, ఎం.రవికుమార్, బిజయ కుమార్ పండా, ఎం.రవికుమార్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంత్ జగ్‌దేవ్‌కు బెయిల్ నిరాకరణ

భువనేశ్వర్: చిలికా నియోజకవర్గ సిటింగ్ ఎమ్మెల్యే, బీజేపీ ఖుర్దా ఎమ్మెల్యే అభ్యర్థి ప్రశాంత్ జగ్‌దేవ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) ధ్వంసం కేసులో ఆయన బెయిల్ పిటిషన్‌ను ఖుర్దా అదనపు జిల్లా సెషన్స్- 2 కోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఖుర్దా జిల్లా బెగుణియా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బొలొగొడొ మండలం కంపురిపట్న 114వ నంబరు పోలింగు బూత్ ప్రాంగణంలో మే 25న మూడో రౌండ్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ జరుగుతుండగా ఈవీఎంను పగలగొట్టి ఇద్దరు పోలింగ్ సిబ్బంది పట్ల చేయి చేసుకున్న ఆరోపణ కింద ప్రశాంత జగదేవ్‌ను మే 26న అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఖుర్దా జైలులో ఉన్నారు. బెయిల్ కోసం రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించవచ్చని సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ప్రశాంత జగదేవ్ తరఫున సీనియర్ న్యాయవాది పీతాంబర్ ఆచార్య మీడియాతో మాట్లాడుతూ... సిట్టింగ్ ఎమ్మెల్యే నిర్దోషిగా పేర్కొన్నారు. క్రిమినల్ మాదిరిగా ఎఫ్ఐఆర్ లేకుండానే ప్రిసైడింగ్ అధికారిపై ఒత్తిడి తెచ్చి మరీ కేసు నమోదు చేశారని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో నేలపై కూర్చోబెట్టి నీళ్లు కూడా ఇవ్వలేదన్నారు.

బీజేడీ కుట్ర..

ప్రశాంత జగదేవ్ అరెస్టును అధికార బీజేడీ కుట్రగా బీజేపీ అభివర్ణించింది. భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి సోషల్ మీడియా వేదికగా నిందిత ఎమ్మెల్యే నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేందుకు సంఘటన జరిగిన పోలింగ్ బూత్‌లోని సీసీటీవీ ఫుటేజీని ప్రసారం చేసిన విషయం తెలిసిందే.

జగన్నాథుని దర్శనం తాత్కాలికంగా నిలిపివేత

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో శుక్రవారం స్వామి వారి దర్శనం సుమారు 2 గంటల పాటు తాత్కాలికంగా నిలిపివేశారు. ఉదయం మంగళహారతి తర్వాత లఘు దర్శనం (భిత్తొ రొ కథొ) కొనసాగుతుండగా జయ విజయ ద్వారం కింది మెట్టు ప్రాంతంలో వాంతి చేసిన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో ఆలయ శుద్ధి ప్రక్రియ చేపట్టారు. రత్న వేదికపై మూల విరాట్టులకు మహా స్నానం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు



వెంకటరమణకు పెన్షన్ పత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎం దాస్

పర్లాకిమిడి: గుమ్మా సమితి సమ్మనగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటరమణ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం బ్లాక్ శిక్షాధికారి, హెచ్ఎం హరి హరదాస్ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. వెంకటరమణ సేవలు కొనియాడారు. అనంతరం పెన్షన్ ఆమోద పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాణాంతకంగా వడగాలులు

- రాష్ట్రంలో వడదెబ్బ మృతులు ఐదుగురు: ఎస్ఆర్‌పీ
- మరో ఐదు రోజులూ వేడిగాలులే..
- వడదెబ్బ నివారణకు మార్గదర్శకాలు జారీ

భువనేశ్వర్/పర్లాకిమిడి/రాయగడ: రాష్ట్రంలో వేడిగాలులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, వడదెబ్బ కారణంగా ఐదుగురు మృత్యువాత పడిన ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) సత్యబ్రత సాహు శుక్రవారం ప్రకటించారు. బాలాసోర్, ఢెంకనాల్, మయూర్‌భంజ్, సోన్‌పూర్, బొలంగీర్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున వడదెబ్బతో మృతి చెందినట్లు స్పష్టం చేశారు. సుందర్‌గఢ్‌లో 12, ఝూర్సుగుడలో 6 అనుమానాస్పద వడదెబ్బ మరణాలు ఇంకా ధ్రువీకరించాల్సి ఉందన్నారు. ఈ మరణాలకు కచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్‌సీ తెలిపారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ)ని సమాచారం ప్రకారం రాష్ట్రంలో రానున్న 5 రోజుల పాటు వేడిగాలులు వాతావరణం కొనసాగే అవకాశం ఉందని సత్యబ్రత సాహు తెలిపారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని మార్గదర్శకాలు జారీ చేశారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- ఆరోగ్య సమస్యల పీడితులు, శిశువులు, వృద్ధులు, గర్భిణులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి.
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య బయట తిరగకుండా జాగ్రత్త వహించాలి.
- తేలికపాటి లేత రంగు, వదులుగా ఉండే నూలు దుస్తులను ధరించాలి.
- అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలను కప్పుకోవడం, నెత్తిన తడి గుడ్డ, టోపీ, గొడుగు ఉపయోగించడం మంచిది.
- దాహం అనిపించకపోయినా తరచూ నీరు తాగడం శ్రేయస్కరం. ఓఆర్ఎస్, లస్సీ, పుల్లని గంజి, చెరకు రసం, నిమ్మ నీరు, మజ్జిగ వంటి ఇంట్లో తయారుచేసిన పానీయాలు శరీరాన్ని నిర్జలీకరణ(డీ హైడ్రేషన్) నుంచి రక్షణ కల్పిస్తాయి.
- చల్లని సమయాల్లో శ్రమతో కూడిన కార్యకలాపాలకు ప్రణాళిక చేసుకోవాలి.
- వడదెబ్బ నివారణ చర్యల పట్ల సాధారణ ప్రజానీకాన్ని చైతన్య పరిచే దిశలో విస్తృతంగా మైక్ ప్రసారం చేయాలని స్థానిక పాలన యంత్రాంగానికి ఆదేశించారు.
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య పని వేళలు లేకుండా చూసుకోవాలి.
- అన్ని బస్సుల్లో తాగు నీరు, ఓఆర్ఎస్, ఐస్ క్యూబ్‌లను అందుబాటులో ఉంచాలి.
- బయట తిరిగే సమయంలో బూట్లు, చెప్పులు వంటి పాదరక్షలు, గొడుగు వినియోగం తప్పనిసరి

రాయగడలో కాస్త ఊరట..

రాయగడలో శుక్రవారం సాయంత్రం కాసేపు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. మరోవైపు తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండటంతో పట్టణ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షం పడినా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేయడం పరిపాటిగా మారిందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



భువనేశ్వర్‌లోని రాష్ట్ర ప్రకృతి విపత్తుల విభాగంతో టెలి కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడుతున్న గజపతి జిల్లా అధికారులు

మండుతున్న ఝూర్సుగుడ..

ఝూర్సుగుడ జిల్లాలో వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంది. ఈ ప్రాంతంలో పలు అనుమానాస్పద వడదెబ్బ మృతులు కలవరపరుస్తుండగా ఐదుగురు మృతుల్ని అధికార వర్గాలు ధ్రువీకరించాయి. ఈ నేపథ్యంలో బ్రజరాజ్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్, ఎస్‌డీపీఓ, ఝూర్సుగుడ ఆర్‌టీఓతో పాటు లారీ యజమానులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. వడదెబ్బ ముప్పు నుంచి ప్రజలు బయటపడేందుకు తీసుకోవాల్సిన పలు చర్యలను సమావేశంలో నిర్ణయించారు.

- రాష్ట్రంలోనే ఝూర్సుగుడలో అత్యధికంగా 47 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా చరిత్రలో ఆరో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కావడం వరుసగా ఇది మూడోసారి. ఐఎండీ శుక్రవారం మధ్యాహ్నం వాతావరణ సమాచారం ప్రకారం 2.30 గంటల సమయానికి 44.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు అయింది.

జిల్లా యంత్రాంగం అప్రమత్తం

గజపతి జిల్లా కలెక్టరేట్‌లో రోహిణీకార్తెలు ఎండలు ఎదుర్కోవడానికి జిల్లా పాలనాధికారి స్మృతి రంజన్ ప్రధాన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. వడగాల్పులు ఎదుర్కొనేందుకు వివిధ ప్రభుత్వ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో ఓఆర్ఎస్, వడదెబ్బ బాధితులకు ప్రత్యేక బెడ్లు, ఏసీలు ఏర్పాటు చేయాలని సి.డి.ఎం.ఓ డాక్టర్ పి.కె.పాత్రోకు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి బ్లాక్ స్థాయి సామాజిక ఆరోగ్య కేంద్రంలో వడదెబ్బ పేషెంట్లకు వార్డు కేటాయించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీరేంద్రకుమార్ దాస్, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ పాత్రో, జిల్లా ముఖ్య ప్రాణి చికిత్సా అధికారి డాక్టర్ ధర్మేంద్ర మహంతి, డీఈఓ మాయాధర్ సాహు, జిల్లా అత్యవసర అధికారి జగన్నాథ పాడి, తహశీల్దారు నారాయణ బెహరా తదితరులు పాల్గొన్నారు.

తుది విడత పోలింగ్ నేడే

- ఓటు హక్కు వినియోగించుకోనున్న 99,55,556 మంది ఓటర్లు
- భద్రత చర్యలు కట్టుదిట్టం: డీజీపీ



మాట్లాడుతున్న డీజీపీ అరుణ్‌కుమార్ షడంగి

భువనేశ్వర్: రాష్ట్రంలో 9 జిల్లాల్లోని ఆరు లోక్‌సభ, 42 శాసన సభ సెగ్మెంట్లపై ఒడిశా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని (డీజీపీ) అరుణ్‌కుమార్ షడంగి శుక్రవారం విలేకర్లకు తెలిపారు. శనివారం చివరి దశ ఎన్నికలు జరగనున్న నియోజకవర్గాలు శాంతిభద్రతల కోణంలో సమస్యాత్మకమైనవని పేర్కొన్నారు. మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా పార్లమెంటరీ నియోజకవర్గాల్లో 126 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు దళం (సీఏపీఎఫ్), 86 ప్లాటూన్ల రాష్ట్ర సాయుధ పోలీసులు, 20,500 మంది సివిల్ పోలీసు సిబ్బందితో సహా 36,000 మంది పోలీసులను మోహరించినట్లు వివరించారు. సివిల్ పోలీసు సిబ్బందిలో 44 మంది అదనపు ఎస్పీలు, 99 మంది డీఎస్పీలు, 210 మంది ఇన్‌స్పెక్టర్లు, 2,583 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, 9,476 మంది హవల్దార్లు, కానిస్టేబుళ్లు, 8,083 మంది హోంగార్డులు, గ్రామ రక్షకులు ఉన్నారని తెలిపారు. జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, మయూర్‌భంజ్, భద్రక్, బాలాసోర్ జిల్లాలకు ఎస్‌డీపీఓ ర్యాంక్‌కు చెందిన నలుగురు యువ ఐపీఎస్ అధికారులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని చెప్పారు.

- ఒక్కో అసెంబ్లీ సెగ్మెంటులో కనీసం 12 మంది డీఎస్పీలు, 42 మంది అసెంబ్లీ సూపర్‌వైజింగ్ ఆఫీసర్లు స్ట్రైకింగ్ ఫోర్స్‌తో అడిషనల్ ఎస్పీలు, 84 మంది డీఎస్పీలు (ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు 2 మంది చొప్పున), స్ట్రైకింగ్ ఫోర్స్‌తో ఇన్‌స్పెక్టర్ హోదాలో 199 మంది సెక్టార్ అధికారులను నియమించామని డీజీపీ వివరించారు. నియోజకవర్గాన్ని ఐదు సెక్టార్‌లుగా విభజించినట్లు తెలిపారు.
- 2,280 సంక్లిష్ట, సమస్యాత్మక బూత్‌లలో సీఏపీఎఫ్‌ని మోహరించనున్నట్లు డీజీపీ తెలిపారు. 843 సాధారణ మొబైల్ యూనిట్లు, అదనంగా 130 సీఏపీఎఫ్ మొబైల్ యూనిట్లను మోహరించినట్లు పేర్కొన్నారు. సీఏపీఎఫ్ కంపెనీ కమాండర్, డిప్యూటీ కమాండెంట్ వీటిని పర్యవేక్షిస్తారని చెప్పారు.
- 60 అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు, 255 ఫ్లయింగ్ స్క్వాడ్, 255 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను మోహరించామన్నారు.13 ప్రదేశాలలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, వీటిని రెండంచెల్లో సీఏపీఎఫ్, రాష్ట్ర సాయుధ పోలీసు దళాలు కాపలా కాస్తాయని తెలిపారు.
- జూన్ 1న ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో ఎన్నికలకు సంబంధించి మొత్తం 36 కేసులు నమోదు చేశామని, 49 మంది నిందితులపై చర్యలు చేపట్టినట్లు డీజీపీ తెలిపారు. 4 అసెంబ్లీ సెగ్మెంట్లు మతపరమైన సమస్యాత్మకమైనవి కావడంతో అక్కడ అదనపు బలగాలను మోహరించినట్లు చెప్పారు.
- పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లకు సరిహద్దుగా ఉన్న బాలాసోర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో 21 అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు కూడా ఏర్పాటు చేశామని, అక్కడి నుంచి సీసీటీవీ ద్వారా పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లలో కూడా 19 చెక్‌పోస్టులు ఉన్నాయని చెప్పారు.
- రాష్ట్రంలో తొలి మూడు రౌండ్ల ఎన్నికల్లో నామమాత్రంగా రీపోలింగ్ జరిగిందని, బౌధ్ జిల్లాలోని కంధమల్ ప్రాంతం కొంటామల్‌లో రెండు బూత్‌లలో మాత్రమే రీపోలింగ్ జరిగినట్లు డీజీపీ పేర్కొన్నారు.
- చిట్ట చివరి దశ ఎన్నికల పోలింగ్‌లో మొత్తం 99,55,556 మంది ఓటర్లు పాల్గొంటారని, వీరి కోసం ఎనిమిది జిల్లాల్లో 10,882 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని డీజీపీ వివరించారు. ఈ దశలో అత్యధికంగా కోస్తా ఒడిశా ప్రాంతాలు ఉన్నాయని, వీటిలో 20 శాతం పోలింగ్ స్టేషన్లు క్లిష్టమైనవిగా ప్రకటించారు. 20 శాతం ఆదర్శ పోలింగు కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు.

గ్రామదేవత ఉత్సవాలకు శ్రీకారం



ముహూర్తపు రాట వేస్తున్న దృశ్యం

రాయగడ: రాయగడలో జూన్ 17 నుంచి తొమ్మిది రోజుల పాటు జరగనున్న బురదల పోలమ్మ అమ్మవారి గ్రామదేవత ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ముహూర్తపు రాట వేశారు. మెయిన్ రోడ్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పూజా మండపం ప్రాంగణం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు బలముండ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు పూజా కార్యక్రమం నిర్వహించారు. జూన్ 16న చాటింపు, 17న పాదాలు తెచ్చే కార్యక్రమం ఉంటుందని కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎద్దు శ్రీహరి, రిక్కా హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు పయనం



ప్రజాస్వామ్యంలో అతిపెద్ద పండగ పోలింగ్. అర్హులైన ప్రతి పౌరుడు పూర్తి స్వేచ్ఛతో నిర్భయంగా ఓటు వేయడం అనివార్యం. దీనికి అనుగుణంగా ఓటర్లకు చేరువలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటు వేసేందుకు భారత ఎన్నికల సంఘం మారు మూల ప్రాంతాల సైతం కొండకోనలు, నదీ తీరాల్లో సకల ఏర్పాట్లు చేస్తుంది. శనివారం జరగనున్న చివరి దశ ఎన్నికల పోలింగ్‌ను కేంద్రాపడా జిల్లా మహాకలపడా నియోజకవర్గం పరిధిలోని బత్తీఘెురొ ప్రాంతంలో నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం ఇలా పడవలో బయల్దేరింది. – భువనేశ్వర్

ఆరుకు చేరిన చందనయాత్ర మృతులు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని చందన యాత్ర సందర్భంగా సంభవించిన బాణసంచా పేలుడు ఘటనలో మరో ముగ్గురు బాధితులు కాలిన గాయాలతో మరణించారు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరిందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శుక్రవారం ప్రకటించింది. ఉదయం ఒకరు మృతి చెందగా, మధ్యాహ్నం మరో ఇద్దరు మరణించినట్లు పేర్కొంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మృతుల బంధువులకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు పూరి జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 26 మంది బాధితులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నరేంద్ర సరోవరం దేవీ ఘాట్ సమీపంలో బాణసంచా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సి) సత్యబ్రత సాహు నేతృత్వంలో ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. పూరీ జిల్లా పోలీసు విభాగం స్వయంగా కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ప్రకటించింది. సైంటిఫిక్ టీమ్‌తో పాటు బాంబు నిర్వీర్య బృందం విచారణ కొనసాగిస్తోందని, కారకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా తెలిపారు.

ట్రక్కును ఢీకొన్న కారు

- నలుగురికి తీవ్ర గాయాలు

జయపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధ శైవక్షేత్రం గుప్తేశ్వర్‌కు వెళ్లి పూజలు చేసి కారులో తిరిగి వస్తుండగా ట్రక్కును ఢీకొట్టడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్ సమితి ఖిరిపాదర్ గ్రామానికి చెందిన బలరాం గౌడ, కుమారుడు చందన గౌడ, తల్లి అయిలా గౌఢ, తొహార పంచాయతీ బొణిపాదర్ గ్రామానికి చెందిన చిత్ర గౌడగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి శుక్రవారం తెలిపారు.

కారు ఢీకొని చిరు వ్యాపారి మృతి



మృతి చెందిన సురేష్



ప్రమాదానికి గురైన కారు



నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం

రాయగడ: కారు ఢీకొన్న ఘటనలో వ్యాపారి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రామనగుడ ప్రాంతానికి చెందిన పూన్న సురేష్ (47) తన ద్విచక్ర వాహనంపై చిల్లర వస్తువులు విక్రయించేందుకు సమీప గ్రామాలకు వెళ్లాడు. ఈ క్రమంలో రామనగుడ సమీపంలోని చకుండా కూడలి వద్ద ఎదురుగా వస్తున్న కారు అదుపుతప్పి బలంగా ఢీకొట్టింది. దీంతో సురేష్ ఎగిరి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో రామనగుడ పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో కారు కూడా నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విశ్వనాథ్‌నగర్‌లో పట్టపగలే దోపిడీ

పర్లాకిమిడి: పట్టణంలోని మొక్కతోటమ్మ మందిరం ప్రాంతంలో విశ్వనాథ్‌నగర్‌లో దోపిడీ జరిగింది. ఒకటో లైన్‌లో నివాసముంటున్న సీహెచ్. శ్యామసుందర్ పట్నాయక్ భార్య ఒక్కరే ఉన్న సమయంలో ఇంట్లో దొంగలు చొరబడి కుటుంబ సభ్యులను కత్తితో బెదిరించారు. బీరువాలో ఉన్న రూ.నాలుగు లక్షల నగదు, ఐదు తులాల బంగారం దోచుకున్నారు. సమాచారం అందుకున్న ఆదర్శ పోలీసుస్టేషన్ అధికారి ప్రశాంత్ భూపతి సిబ్బందితో చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఎస్.డి.పి.ఓ. మాధవానంద నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ముగిసిన తుది విడత ప్రచారం

- కట్టుదిట్టంగా చర్యలు: సీఈఓ
- రూ.270 కోట్ల విలువైన నగదు, వస్తువులు స్వాధీనం

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ చిట్ట చివరి దశ మరి కొన్ని గంటల్లో ముగియనుంది. నిబంధనల మేరకు అభ్యర్థుల ప్రచారం ముగిసింది. ఈ నేపథ్యంలో 4వ దశ ఒడిశా ఎన్నికలకు మరికొన్ని గంటలు మిగిలి ఉన్నందున టెలివిజన్, ఇతరేతర ప్రసార మాధ్యమాల ద్వారా ఏదైనా ఎన్నికల సమాచారాన్ని ప్రసారం చేయడానికి వీల్లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీఈఓ నికుంజ బిహారీ ధొలొ శుక్రవారం ప్రకటించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

రికార్డు స్థాయిలో నగదు స్వాధీనం..

సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని రాష్ట్రంలో భారీ స్థాయిలో నగదు, ఆభరణాలు, మాదక ద్రవ్యాలు ఇతరేతర అభ్యంతరకర సామగ్రి స్వాధీన పరచుకున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) తెలిపారు. ఈ ఏడాది మార్చి 1 నుంచి ఇప్పటి వరకు రూ. 270 కోట్ల విలువైన నగదు, వివిధ వస్తువులను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయని చెప్పా. ఎన్నికల సమయంలో ఇంత భారీగా డబ్బు, ఇతర వస్తువులు పట్టుబడటం రాష్ట్రంలో ఇదే తొలిసారిగా పేర్కొన్నారు. ఇందులో రూ. 20.80 కోట్ల నగదు, రూ. 40.75 కోట్లు మద్యం, రూ.77.99 కోట్లు మాదక ద్రవ్యాలు, రూ. 14.74 కోట్లు బంగారం సహా విలువైన లోహాలు, రూ. 141.57 కోట్ల ఉచిత, ఇతర వస్తువులు ఉన్నట్లు వివరించారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నియమావళి, నిబంధనలు అమలులోకి వచ్చినప్పటి నుంచి 'సి-విజిల్' యాప్ ద్వారా 15,000కు పైగా ఫిర్యాదులు అందాయని చెప్పారు. వీటిలో 11,000 కంటే ఎక్కువ (సుమారు 74 శాతం) ఆరోపణలు వాస్తవమైనవని, తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు సీఈవో తెలిపారు. అదేవిధంగా నాలుగో, చివరి విడత ఎన్నికలకు సంబంధించి 'సి విజిల్' యాప్ ద్వారా మొత్తం 5,600 ఫిర్యాదులు అందాయన్నారు. అన్ని ఫిర్యాదులను విచారించామని, దాదాపు 80 శాతం ఫిర్యాదులు నిజమేనని ధొలొ చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పర్లాకిమిడి: గుమ్మా బ్లాక్ పర్సంబ గ్రామ శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు పర్లాకిమిడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వ్యక్తి చనిపోయి రెండు మూడు రోజులై ఉంటుందని సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్ తెలిపారు. మృతుడి వయసు 42 ఏళ్లు ఉండవచ్చని, ఎటువంటి గాయాలు కాలేదని, కల్తీ సారా తాగి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఆదర్శపోలీసు ఐఐసీ ప్రశాంత్ భూపతి, ఏఎస్ఐ సెతి, కేసును విచారిస్తున్నారు.

క్లుప్తంగా

మహిళపై హోంగార్డ్ లైంగికదాడి

- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

విజయనగరం క్రైమ్: బైక్‌పై వెళ్తున్న ఓ జంటను పోలీస్ వాహనంలో తన స్నేహితుడితో కలిసి వచ్చిన ఓ హోంగార్డ్ అడ్డగించి, బెదిరించి మహిళను తుప్పల్లోకి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు దిశ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి కుమిలి వెళ్లే రహదారిలో బైక్‌పై తన కుటుంబసభ్యుడితో కలిసి వెళ్తున్న సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన మహిళను చూసిన హోంగార్డ్, అతని స్నేహితుడు పోలీస్ వాహనంపై వాని వెనుక వెళ్లి కుమిలి వెళ్లే రహదారిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతం వద్ద బైక్‌ను ఆపారు. అనంతరం బైక్‌పై ఉన్న వ్యక్తిని హోంగార్డ్ బెదిరించి, అక్కడే తన స్నేహితుడిని ఉంచి, మహిళను సమీప పొదల్లోకి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదుతో దిశ పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే లైంగికదాడికి పాల్పడిన హోంగార్డ్ ఎవరనేది ఇంకా నిర్ధారణ కాలేదని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని దిశ సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

జూన్ 6న గిరిమిత్ర హాల్‌లో కౌన్సెలింగ్

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆంగ్ల మాధ్యమంలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ నెల 6వ తేదీన కౌన్సెలింగ్ జరగనుంది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆరోజు ఉదయం 10 గంటలకు ఐటీడీఏ గిరిమిత్ర మీటింగ్ హాల్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 25లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూ.గురుకులం. ఏపీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలని ప్రకటనలో స్పష్టం చేశారు.

జేసీబీ డ్రైవర్‌పై కేసునమోదు

సంతకవిటి: మండల పరిధిలోని గొల్లవలస గ్రామంలో జేసీబీ డ్రైవర్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. జేసీబీతో డ్రైవర్ శంకర్ గురువారం గ్రామంలో నేలను చదును చేస్తుండగా అడ్డుగా ఉన్నాయని జీడి చెట్టు కొమ్మలను తొలగించడంతో కొమ్మలు పడి చింతాడ శివ, చింతాడ ప్రవీణ్(10), యజ్జల గౌతమ్‌లకు గాయాలయ్యాయి. దీంతో వారు రాజాంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో చింతాడ శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ వివరించారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

మక్కువ: మండలంలోని చెముడు గ్రామానికి చెందిన కరణం కూర్మినాయుడు(67) శుక్రవారం వడదెబ్బకు గురై మృతిచెందాడు. కూర్మినాయుడు తెల్ల వారు జామున గ్రామం సమీపంలోని తమ పొలానికి వెళ్లి, పొలం పనులు చేస్తుండగా, ఎండకు తాళలేక అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు ఇంటికి తీసుకువచ్చి సపర్యలు చేసినప్పటికీ మృతిచెందాడు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు.

గాయపడిన మహిళ..

సీతంపేట: వంబరెల్లి లోయలో ఇటీవల ఆటో బోల్తా పడి తీవ్రంగా గాయపడిన గిరిజన మహిళ సవర అనిత శుక్రవారం విశాఖపట్నం కేజీహెచ్‌లో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అనిత మృతి వార్త విన్న భర్త చంద్రమోహన్, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి మహిళకు తీవ్రగాయాలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ నంబర్ 2లో రైలు నుంచి జారిపడిన ఓ మహిళ జారిపడి శుక్రవారం తీవ్రగాయాలపాలైంది. దీనిపై జీఆర్‌పీ ఇన్‌చార్జి రత్నాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్కువ మండలంలోని డి.శిర్లాం గ్రామానికి చెందిన సిరికి కృష్ణవేణి పార్వతీపురం నుంచి గోపాలపట్నం వెళ్లేందుకు కదులుతున్న సమతా ఎక్స్‌ప్రెస్ ఎక్కుతుండగా కాలు జారి ప్లాట్‌ఫాంపై పడి తీవ్రగాయాల పాలయ్యింది. తక్షణమే ఆమెను చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పెట్రోల్‌బంకు వద్ద వ్యక్తి మృతి

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస పెట్రోల్ బంకులో పనిచేస్తున్న మండల పరిధిలోని వీఆర్‌అగ్రహారం గ్రామానికి చెందిన బంగారు రామచంద్రరావు (54) శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామచంద్రరావు బహిర్భూమికి వెళ్లి వస్తుండగా పెట్రోల్ బంకు వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే గమనించి సిబ్బంది సపర్యలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వెంటనే బంకు యాజమాన్యం పోలీసులకు, మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మృతుని కుటుంబసభ్యులు భోరున విలపించారు.



జవాన్లు వినియోగించే ఆయుధం



గన్ వాడకాన్ని వివరిస్తున్న అధికారి



ఆయుధాల వివరాలతో కూడిన షీట్లు

ఆకట్టుకున్న ఆయుధ ప్రదర్శన

జయపురంలోని విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరుగుతున్న ఎన్.సి.సి వార్షిక శిబిరంలో భాగంగా బీఎస్ఎఫ్ బెటాలియన్ అధికారులు ఏర్పాటు చేసిన యుద్ధ ఆయుధాలు, పరికరాలు ఆకట్టుకుంటున్నాయి. మెషీన్ గన్లు గ్రెనేడ్లు, మోర్టార్లు తదితర ఆయుధాల పనితీరును అధికారులు వివరించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఎస్.రోజన్ సింగ్, ఇన్‌స్పెక్టర్ హెచ్.ఆనందసింగ్, ఆర్‌పీ సింగ్, ఒన్ ఒడిశా ఇన్‌ఫ్రంట్ కమాండర్ కంపెనీ సీఓ, కేంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కర్నల్ ప్రీతిరంజన్ దాస్, సీనియర్ జేసీఓ సతీష్ చంద్ర, సుబేదార్ పద్మన్ ఆప, వర్సిటీ ఏఎన్ఓ కెప్టెన్ లక్ష్మణ పాత్రో, మదనమోహన ఓజ, లెఫ్టినెంట్ ఉదయ నాయిక్, ఉదయ భాస్కరరావు, లెఫ్టినెంట్ సుశాంత మఝి, సంజయ కుమార్ పాఢి, ఎన్‌సీసీ అల్యూమిని మహమ్మద్ షరీఫ్, నిసాన్ పట్నాయక్, రబి నారాయణ, దుర్గా ప్రసాద్ సాహు, కృష్ణ కేశవ షాబంగి, దీపక్ షాడంగి పాల్గొన్నారు.

– జయపురం



ఆయుధ ప్రదర్శన తిలకిస్తున్న పౌరులు



శిక్షణ పొందుతున్న కేడర్



ఆయుధాల పనితీరు వివరిస్తున్న బీఎస్ఎఫ్ అధికారి

శరవేగంగా రామసాగరం పనులు



జాజిపురం గ్రామం వద్ద ఉన్న రామసాగరం

పర్లాకిమిడి: ఉప్పలాడ పంచాయతీ జాజిపురం వద్ద రామసాగరం పునరుద్ధరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటివరకూ 60 శాతం మట్టి వెలికితీత పనులు పూర్తయ్యాయని, మరో నెల రోజుల్లో మొత్తం పనులు పూర్తవుతాయని చిన్ననీటి పారుదల శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.జగన్నాథ్ తెలిపారు. సాగరం పనులు పూర్తయితే 306 హెక్టార్ల భూమికి సాగునీరు అందుతుందని చెప్పారు. ప్రస్తుతం గుర్రపు డెక్క, మట్టితీత పనులకు ప్రభుత్వం రూ.3.22 కోట్లు కేటాయించిందన్నారు. మొత్తం డి.పి.ఆర్.విలువ రూ.10.25 కోట్లకు పంపించగా, ప్రభుత్వం ప్రస్తుతం తొలిఫేజ్‌కు రూ.3.22 కోట్లు (జీఎస్టీతో కలిపి) నిధులు విడుదలయ్యాయని చెప్పారు. రామసాగరంలో పూర్తి స్థాయిలో పనులు పూర్తయితే సాగునీటితో పాటు చిల్డ్రన్ పార్కింగ్, బోటింగ్ ఏర్పాటు చేసి తద్వారా ప్రభుత్వానికి ఆదాయ వనరులు కూడా లభిస్తాయని వివరించారు. కాగా, రామసాగరం విస్తీర్ణం 18.1 చదరపు కిలోమీటర్లు. రామసాగరం ద్వారా ఒడిశా, ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా పాతపట్నం వరకూ భూములకు సాగునీరు అందుతుంది. ఎన్నికల ముందు సీఎం నవీన్ పట్నాయక్ ప్రత్యేక కార్యదర్శి వి.కార్తికేయ పాండియన్ ఇక్కడికి విచ్చేసినప్పుడు రామసాగరం పునరుద్ధరణ పనులకు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.ఈ మేరకు నిధులు కేటాయించారు.



ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం



ప్రొక్లెయిన్ల ద్వారా సాగరంలో మట్టిని తవ్వుతూ..



పి.జగన్నాథ్, చిన్ననీటి పారుదల శాఖ ఎస్ఈ

మెట్రిక్ టాపర్లకు పూర్వ విద్యార్థుల సన్మానం

జయపురం: ఇటీవల విడుదలైన మెట్రిక్ పరీక్షల్లో స్థానిక సరస్వతీ శిశుమందిర్ శారదా విహార్ పాఠశాలలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. పాఠశాలకు చెందిన అభినవ పండా, సహిల్ ప్రతీక దొలాయ్, సుభాష్ శంకర సాహు, శుభంకర ఖుంటియ, స్మృతి పాణిగ్రాహి, రాజనందినీ పాల్ ఏ–1 గ్రేడ్ సాధించగా, వీరిలో అభినవ పండా జిల్లా టాపర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. వీరందరికీ ప్రశంసాపత్రాలు అందజేసి జ్ఞాపికలతో సత్కరించారు. భవిష్యత్తులో మరింతగా ఉత్తమ ఫలితాలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్య వక్త జుగల్ కిశోర్ మిశ్రా మాట్లాడుతూ విద్యారంగంలో సరస్వతీ శిశుమందిర్ శారదావిహార్ సాధిస్తున్న విజయాలు ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మనోరంజన్ ప్రధాన్, హెచ్‌ఎం సత్యనారాయణ సెఠి, యాజమాన్య కమిటీ కార్యదర్శి పంకజ కుమార్ పాత్రో, సహాయ కార్యదర్శి కిశోర్ చంద్ర పండా, ప్రేమానంద దాస్, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి కె.సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు అనంత నారాయణ మహాపాత్రో, కె.లలిత తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న టాపర్లు

గాబువానిపేటలో చోరీ

భోగాపురం: మండలంలోని గాబువానిపేటలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నక్క రాంబాబు, భార్య రమ గురువారం రాత్రి ఇంటి మేడపై నిద్రిస్తున్న సమయంలో సుమారు అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో దొంగలు వచ్చి వారి ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు అభరణాలతో పాటు రూ.10 వేలు నగదును దొంగలించుకుపోయారు.

శుక్రవారం ఉదయం భార్యాభర్తలు ఇంట్లో చూసేసరికి చిందరవందరగా పడి ఉన్న సామాన్లతో పాటు బీరువాలో దాచుకున్న బంగారు అభరణాలు, నగదు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ ఎ.రవికుమార్ తెలిపారు.

గదబ సంప్రదాయాన్ని పరిరక్షించాలి



సంప్రదాయ వేషధారణలో గదబ యువతులు

జయపురం: కొరాపుట్ జిల్లాలో అతి ప్రాచీనమైన గదబ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలని పొట్టంగి మాజీ ఎమ్మెల్యే రామచంద్ర కడమ్ అన్నారు. కొరాపుట్ జిల్లా కుందులి గ్రామ పంచాయతీ లెంజి కుందులి గ్రామంలో శుక్రవారం గదబ సమాజ్ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మెలగాలే తప్ప సంప్రదాయాలను, సంస్కృతులను మర్చిపోకూడదన్నారు. గిరిజన పిల్లలకు ఉత్తమ విద్య అందించడం కీలకమన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో గదబ సమాజ్ కార్యదర్శి మదన పామియ, కోశాధిపతి రబి ఖొర, సలహాదారు ధనుర్జయ తకురియ, నాథ్ తెంతులి, పాడియ ధామ ముండ గొడియ, ఉగ్రసేన్ చపడి, త్రిపతి సార తదితరులు పాల్గొన్నారు.

ఫైడితల్లి వనంగుడి హుండీల ఆదాయం లెక్కింపు



వనంగుడిలో పైడితల్లికి అలంకరించిన వెండి కిరీటం, హారం



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి వనంగుడి హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. 65 రోజులకు రూ.5,84,73,000ల నగదు, 110 గ్రాముల వెండి, 108 కాసుల వెండి హారం, వెండి కిరీటం వచ్చిందని ఈఓ డీవీవీ ప్రసాదరావు తెలిపారు. హారం, కిరీటాన్ని వనంగుడి అమ్మవారికి అర్చకులు అలంకరించారు. కార్యక్రమంలో అమ్మవారి సేవా సమితి, శ్రీవారి సేవా సంస్థ సభ్యులు, అర్చకులు, సిబ్బంది, కెనరా బ్యాంకు అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బిట్‌కాయిన్ కోసం జంట హత్యలు

- ఆంధ్రాలో ఒడిశా దంపతులపై దారుణం
- కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీస్పీ కృష్ణారావు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణారావు, ఎస్సైలు, వెనుకన నిందితుడు





పాలకొండ: ఏజెన్సీ ప్రాంతంలో బిట్‌కాయిన్ మోసాలు హత్యల వరకు దారితీశాయి. ఇంతవరకు నగదు వరకే సాగిన ఈ వ్యాపారం ప్రస్తుతం రెండు హత్యలతో సంచలనంగా మారింది. ఈ వ్యాపారంలో ఒడిశాకు చెందిన భార్యాభర్తలు హత్యకు గురికాగా, నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. ఈ నెల 17న సీతంపేట మండలం పులిపుట్టి పంచాయతీ పరిధిలోని ఎర్ర చెరువులో దొరికిన గుర్తు తెలియని మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు ఆ కేసు గురించి డీఎస్పీ కృష్ణారావు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 17న సీతంపేట మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధి ఎర్రచెరువులో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు గ్రామ వీఆర్‌ఓ చేసిన ఫిర్యాదు మేరకు సీతంపేట ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 42 సంవత్సరాల వయస్సుగల మహిళ మెడపై లోతుగా గాయంతో పాటు వీపుపై నాలుగు చోట్ల కత్తిపోట్లు గుర్తించి హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం పాలకొండ సీఐ చంద్రమౌళి నియమితులయ్యారు. కేసు దర్యాప్తులో భాగంగా హతురాలిని గుర్తించేందుకు తొలుత ప్రయత్నించారు. పోలీసులు ప్రచురించిన ఫొటోను చూసిన బంధువులు హతురాలిని ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా, గుమ్మ సమితి, జమ్మి పంచాయతీ, అర్థంగూడ గ్రామానికి చెందిన రూట్ భుయాన్‌గా గుర్తించి సమాచారం ఇచ్చారు. కేసు పరిశోధనలో భాగంగా హతురాలి భర్త మిఖైల్ భుయాన్ కోసం పోలీసులు ప్రయత్నించగా ఆచూకీ లభించలేదు. మూడు రోజుల పాటు ఆయన సెల్‌ఫోన్ కూడా స్విచాఫ్ చేసి ఉండడంతో భర్తే హత్య చేసి ఉంటాడన్న అనుమానంతో ఫోన్ ట్రాప్‌లో పెట్టారు. మూడు రోజుల అనంతరం ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఆధారంగా ఇంకో నంబర్ వాడుతున్నట్లు గుర్తించి నంబర్ ఆధారంగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు.

ఒకరి తర్వాత మరొకరి హత్య

మిఖైల్ భుయాన్ గ్రామంలో తాపీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఇటీవల అతనికి ఒడిశా రాష్ట్రంలోని కాశీనగర్ బ్లాక్ కడశింగి గ్రామానికి చెందిన మరో తాపీ మేస్త్రీ జోసఫ్ భుయాన్‌తో పరిచయం ఏర్పడింది. ఈ సందర్భంగా తన దగ్గర బిట్ కాయిన్ ఉందని దానిని అమ్మి పెట్టాలని మిఖైల్ భుయాన్‌ను జోసఫ్ భుయాన్ కోరాడు. దీంతో ఆ కాయిన్ తానే కొంటానని చెప్పిన మిఖైల్ భుయాన్ లక్ష రూపాయలకు బేరం కుదుర్చుకున్నాడు. ఆ డబ్బులు పట్టుకుని భార్య రూట్ భుయాన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జోసఫ్ భుయాన్ ఇంటికి వెళ్లాడు. అక్కడ వారు మాట్లాడుకున్న అనంతరం కాయిన్ మరో దగ్గర ఉంది తీసుకువద్దామని జోసెఫ్ భుయాన్ చెప్పడంతో మిఖైల్ భుయాన్ భార్యను అక్కడే ఉండమని చెప్పి జోసెఫ్‌తో కలిసి బైక్‌పై వెళ్లాడు. ఒడిశా సరిహద్దు పొలాల్లోకి జోసెఫ్ తీసుకువెళ్లి అక్కడ మిఖైల్ భుయాన్‌ను ముందుగా సిద్ధం చేసుకున్న ఆయుధాలతో హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని కాల్చివేసి మిఖైల్ దగ్గర ఉన్న లక్షరూపాయలు తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. ఇంటిదగ్గర వేచి ఉన్న మిఖైల్ భార్య భుయాన్‌కు నీ భర్త కాయిన్ తీసుకుని అక్కడ ఉన్నాడు. నిన్ను తీసుకురమ్మన్నాడని నమ్మించి తన బైక్‌పై ఎక్కించి సీతంపేట మండలంలోని పుల్లిపుట్టి వద్ద ఎర్రచెరువు వద్దకు తీసుకువెళ్లి హత్య చేశాడు. మృతదేహాన్ని అక్కడే పడేసి ఇంటికి వెళ్లిపోయాడు. హతుడు మిఖైల్ సెల్‌ఫోన్‌లోని సిమ్ తీసి కొత్త సిమ్ వేసి జోసెఫ్ వాడుకోవడంతో పోలీసులకు చిక్కాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బిట్ కాయిన్‌తో పాటు, లక్షరూపాయల నగదు, హత్యకు ఉపయోగించిన కత్తి, ఇతర ఆయుధాలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ చంద్రమౌళి, సీతంపేట ఎస్సై జగదీష్‌నాయుడు, పాలకొండ ఎస్సై ప్రశాంత్‌కుమార్‌లను జిల్లా పోలీసు అధికారులు అభినందించారు. కేసు దర్యాప్తులో పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరును డీఎస్పీ కృష్ణారావు అభినందించారు.

రెండు బైకులు ఢీ.. నలుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో రెండు బైకులు ఢీకొని నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఒడిశా రాష్ట్రం జైపూర్ గ్రామానికి చెందిన జావెద్ అక్తర్ ఇక్కడి సన్‌రే రిసార్ట్స్‌లో వంట కుక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన సొంత పనుల నిమిత్తం శుక్రవారం సాయంత్రం బైక్‌పై తగరపువలస వెళ్లి వస్తుండగా అదే సమయంలో సవరవిల్లి గ్రామానికి చెందిన బోర రమేష్, జగన్, గారి గణేష్ అనే ముగ్గురు యువకులు సినిమా చూసేందుకు బైక్‌పై సవరవిల్లి నుంచి తగరపువలస బయలు దేరారు. పోలిపల్లి గ్రామానికి చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న జావెద్ అక్తర్‌ను బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో బైకులు నడుపుతున్న బోర రమేష్, జావెద్ అక్తర్ తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, సన్‌రే రిసార్ట్స్ యాజమాన్యం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రులకు జావెద్ అక్తర్, బోర రమేష్, జగన్, గణేష్‌లను తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ ఎ.రవికుమార్ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

క్లుప్తంగా

మెగా ఎక్స్‌పో నేడు

శ్రీకాకుళం అర్బన్: యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం శ్రీకాకుళం ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళంలోని సింహద్వారం వద్ద నున్న వెంకటాపురం రీజనల్ కార్యాలయం వద్ద మెగా ఎక్స్‌పో-2024ను నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎంవీ తిలక్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెగా ఎక్స్‌పో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంక్ వైజాగ్ జోనల్ హెడ్ షాలినీ మెనోస్ హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో యూనియన్ బ్యాంక్ లీడ్ బ్యాంక్‌గా ఉందన్నారు. అర్హత కలిగిన ఖాతాదారులకు వెంటనే రుణాలు మంజూరు, అతి తక్కువ వడ్డీకే గృహ, వాహన, విద్య, వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తూ ఖాతాదారుల అభిమానాన్ని చూరగొంటున్నామన్నారు.

సబ్‌జైల్ పరిశీలన



సబ్‌జైలు సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

నరసన్నపేట: స్థానిక సబ్‌జైల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. జైల్‌లో ఉన్న ఇద్దరు ఖైదీలతో మాట్లాడి సదుపాయాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సదుపాయాలు అందుతున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సరఫరాలపై ఆరా తీశారు. అనంతరం కోర్టు సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట స్థానిక సివిల్ జడ్జి సి.హరిప్రియ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం గ్రామ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలికి చెందిన డి.కుమార్ అనే వ్యక్తి శ్రీకాకుళం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బొప్పాయిపురం వద్దకు వెళ్లే సరికి తన ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడకు చేరుకున్న హైవే సిబ్బంది క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

టిప్పర్ బోల్తా.. తప్పిన ప్రమాదం



బోల్తాపడిన మట్టి టిప్పర్

నరసన్నపేట: మండలం లుకలాం-కోమనాపల్లి రోడ్డులో ఉర్లాం వద్ద మట్టితో వెళ్తున్న టిప్పర్ శుక్రవారం ఉదయం బోల్తా పడింది. అతివేగం కారణంగానే బండి బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. రోజూ ఈ ప్రాంతంలో యువకులు, పిల్లలు వాకింగ్, వ్యాయామం చేస్తుంటారు. శుక్రవారం స్థలం మార్చడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



సన్యాసి(ఫైల్)

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన తాడేల సన్యాసి (65) శుక్రవారం వడదెబ్బకు గురై మృత్యువాత పడ్డారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాల ప్రకారం.. సన్యాసి ఉదయం 9 గంటల సమయంలో పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటలైనా ఇంటికి భోజనం కోసం రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూసేసరికి విగతజీవై పడి ఉన్నారు. ఎండ విపరీతంగా ఉండటంతో పాటు అందుబాటులో ఎవరూ లేకపోవడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఆయనకు భార్య వెంకటమ్మ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గదబపాలెంలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన ఆవుల పాక

జి.సిగడాం: మండలంలోని గదబపాలెంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో లండ పాపయ్యకు సంబంధించిన ఆవుల పాక పూర్తిగా దగ్ధమైంది. ఈ పాకలో తిండి గింజలతోపాటు ఇతర సామగ్రి అగ్నికి ఆహుతైంది. అయితే మంటల్లో చిక్కుకున్న ఆరు మూగజీవాలను 65 ఏళ్ల వృద్ధుడు లండ పాపియ్య ధైర్యం చేసి మంటల్లోకి దూకి కాపాడారు. వృద్ధుడికి స్వల్పగాయాలయ్యాయి.

డ్రిల్.. థ్రిల్

టెక్కలి వైఎస్సార్ జంక్షన్‌లో జనాలు గుమి గూడారు.. వారి చుట్టూ ఆయుధాలతో పోలీసులు.. ఆందోళనకారులను చెదరగొడుతూ భాష్ప వాయుగోళాల ప్రయోగాలు.. నిరసనకారులపై నీటిని కుమ్మరించడం, పోలీసు తూటాలకు ఓ వ్యక్తి పడిపోవడం, పోలీసులు అత్యవసరంగా వైద్య సిబ్బంది అంబులెన్స్‌ను తీసుకువచ్చి అతడిని తీసుకెళ్లడం.. ఎన్నడూ చూడని దృశ్యాలను చూసి టెక్కలి వాసులు ఆశ్చర్యపోయారు. అయితే ఇదంతా ప్రజల్ని అవగాహన కల్పించేందుకు చేసిన మాక్‌డ్రిల్ అని తెలుసుకుని అంతా ఊపిరి పీల్చుకున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎక్కడైనా అల్లర్లకు పాల్పడితే పోలీస్ చర్యలు ఏ విధంగా ఉంటాయో తెలియజేయడానికి టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏఆర్ సిబ్బంది, ఇతర పోలీస్ బలగాలు టెక్కలిలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ రాజా, సీఐ షైడయ్యతో పాటు ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. – టెక్కలి



ఆందోళనకారులను కట్టడి చేస్తున్న పోలీస్ ప్రత్యేక బలగాలు



ఆందోళనకారులపై భాష్పవాయువు ప్రయోగాలు



మాక్‌డ్రిల్‌లో భాగంగా నిరసనలో పోలీస్ కాల్పుల్లో గాయపడిన వ్యక్తిని కాపాడేందుకు వైద్య సిబ్బందితో చేరుకున్న పోలీసులు



ఆందోళకారులను కట్టడి చేసేందుకు గాల్లో కాల్పులు చేస్తున్న పోలీసులు



టెక్కలిలో నిర్వహించిన పోలీస్ మాక్‌డ్రిల్‌లో భాగంగా నిరసన చేస్తున్న ఆందోళనకారులు

ఫిట్‌గా ఉండాల్సిందే..

- 12లోగా స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాలి
- పత్రాలు లేకుండా బస్సులు నడిపితే కఠిన చర్యలు
- జిల్లా వ్యాప్తంగా స్కూల్, కాలేజీ బస్సులు 711
- ఇంతవరకూ ఫిట్‌నెస్ తీసుకున్నవి 310 మాత్రమే

శ్రీకాకుళం రూరల్, వజ్రపుకొత్తూరు:

వేసవి సెలవుల అనంతరం జూన్ 12న స్కూళ్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్, కాలేజీ బస్సుల ఫిట్‌నెస్‌పై ఆ శాఖాధికారులు దృష్టి సారించారు. ఆయా యాజమాన్యాలు ఈనెల 12లోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ చేయించుకోవాలని సూచించారు. బస్సులకు ఏవైనా మేజర్ రిపేర్‌లు ఉంటే వాటిని సరిచేసిన తర్వాతే రోడ్డు మీద తిప్పాలని, ఎలాంటి కాగితాలు లేకుండా బస్సులను నడిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఆర్టీవో అధికారుల బృందం ఈ నెల 15 నుంచి 30 వరకూ ఏక కాలంలో స్కూల్ బస్సులపై దాడులు చేయనుంది. ఒక వేళ బస్సులకు ఏదైనా స్కూల్ యాజమాన్యం ఫిట్‌నెస్ చేయించుకోకపోతే ఆయా బస్సులను సీజ్ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా స్కూల్ 711 బస్సులు ఉన్నట్లు ఆర్టీఏ అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటివరకూ కేవలం 310 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఆయా స్కూల్స్, కాలేజీ యాజమాన్యాలు చేయించుకున్నాయి.



బస్సు డ్రైవింగ్ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

పాటించాల్సిన పద్ధతులివీ..

- ప్రతి స్కూల్ బస్సు ఫిట్‌నెస్‌కు సంబంధించి ఆర్‌సి, ఇన్స్యూరెన్స్, టాక్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా బండిలో ఉంచుకోవాలి. ఇవి ఉంటేనే బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను ఆర్టీఏ అధికారులు జారీ చేస్తారు. ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో వీటిని తప్పనిసరిగా చూపించుకోవాలి.
- స్కూల్ బస్సు డ్రైవర్‌కు ఐదేళ్ల డ్రైవింగ్‌లో అనుభవంతో పాటు 60 ఏళ్ల లోపు వయసు ఉండాలి. ఖాకీ యూనిఫారంతోనే బస్సును నడపాలి. కంటి సమస్యలు లేకుండా మెడికల్ సర్టిఫికెట్‌ను సమర్పించాలి.
- ప్రతి బస్సుకు అటెండర్‌ను తప్పనిసరిగా ఉంచాలి.
- బస్సు వేగం గంటలకు 55-60 కిలోమీటర్లు స్పీడ్ ఉండేలా స్పీడ్ గవర్నర్స్ తప్పనిసరిగా చూసుకోవాలి.
- బ్రేక్, హ్యాండ్ బ్రేక్, స్టీరింగ్, టైర్లు, స్పీడో మీటర్ అన్ని కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలి.
- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి. రిఫ్లెక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి.
- బస్సు నుంచి అధిక మోతాదుల్లో బ్లాక్ స్మోక్ రాకుండా చూసుకోవాలి.
- బస్సుకు అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరంతో పాటు ఫస్ట్ ఎయిడ్ బాక్సును ఉంచాలి.
- ఆయా స్కూల్ బస్సులపై డ్రైవర్ పేరు, ఫోన్ నంబర్‌ను నమోదు చేయించాలి.
- పేరెంట్స్ కమిటీ ఆమోదించిన స్కూల్ బస్సులను మాత్రమే తిప్పనివ్వాలి.
- విద్యార్థులతో స్కూల్ బస్సు బయలుదేరినపుడు తప్పనిసరిగా డోర్‌లాక్‌ను చేయించాలి.
- స్కూల్ బస్సులను స్కూల్ ఆవరణలోనే ఉంచాలి. రోడ్డు సేఫ్టీ గురించి విద్యార్థులకు వారానికో రోజు అవగాహన కల్పించాలి.



బస్సులను పరిశీలిస్తున్న మోటార్ హెహికల్ ఇన్‌స్పెక్టర్

తనిఖీలు చేస్తాం..

ఈ నెల 12 నుంచి స్కూల్ బస్సులపై ఆర్టీఏ అధికారుల బృందంతో తనిఖీలు చేయనున్నాం. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉంటేనే రోడ్డు మీదకు బస్సులకు అనుమతి ఇస్తాం. ఏమైనా మేజర్ రిపేర్లు ఉంటే అవి పూర్తి చేశాక మాత్రమే వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తాం. పొరపాటున ఏదైనా బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే ఆయా బస్సులపై, స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ నెలాఖరు వరకూ స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ చేస్తాం.
– పీవీ గంగాధర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

కొనసాగుతున్న పాలిటెక్నిక్ కౌన్సెలింగ్



సహాయ కేంద్రంలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో పాలీసెట్-2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ మేరకు ర్యాంకు ఆధారంగా శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ మే 27 తేదీ నుంచి కొనసాగుతోంది. సహాయ కేంద్రంలో శుక్రవారం 59001 నుంచి 75000 ర్యాంకు మధ్య విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. 281 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 245 బీసీ,ఓసీ, 36 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నారు. మే 27 నుంచి శుక్రవారం వరకు కౌన్సెలింగ్‌కు 1544 మంది హాజరయ్యారు. శనివారం 75001 నుంచి 92000 మధ్య ర్యాంకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. షెడ్యూల్ మేరకు రెండో తేదీ వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుంది. మూడో తేదీన జరగాల్సిన కౌన్సెలింగ్ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆరో తేదీకి వాయిదా పడింది. 7 నుంచి 10 వరకు ఆప్షన్ల ఎంపిక, 11వ తేదీన ఆప్షన్ల మార్పు, 13న సీట్ల అలాట్‌మెంట్‌ల ప్రకటన, 14 నుంచి 19 మధ్య కళాశాలలకు సీట్లు లభించిన విద్యార్థుల రిపోర్టింగ్, 14 నుంచి మొదటి సెమిస్టర్ క్లాస్‌వర్క్ ప్రారంభించనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

ఉపాధ్యాయ సంక్షేమ వారధి 'టెంక'



టెంక చలపతిరావు ఉద్యోగ విరమణ సభలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీటీఎఫ్ సీనియర్ నాయకుడు ఎంపీయూపీ స్కూల్ వాడాడ ఆంగ్ల ఉపాధ్యాయుడు టెంక చలపతిరావు ఉపాధ్యాయ సంక్షేమ వారధిగా విద్యా ప్రగతే లక్ష్యంగా పనిచేశారని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు కొనియాడారు. శుక్రవారం స్థానిక ఇందిరా విజ్ఞాన భవన్ వేదికగా టెంక చలపతిరావు ఉద్యోగ విరమణ అభినందన సభ జరిగింది. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుదీర్ఘ కాలం పాటు ఫెడరేషన్ జిల్లా బాధ్యతల్లో ఉంటూ అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను అధికారుల దృష్టిలో పెట్టి, వాటి పరిష్కారం అయ్యే వరకు కృషి చేసేవారని గుర్తు ఆయన చేశారు. ఉపాధ్యాయ నాయకునిగా చలపతిరావు చూపిన నిబద్ధత, నిజాయితీ అందరికీ ఆదర్శప్రాయమన్నారు. విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ తన హయాంలో తాను చేపట్టిన జిల్లా విద్యాభివృద్ధి ప్రణాళికలు అమలు చేయడంలో ఒక ఉపాధ్యాయ సంఘ నాయకునిగా చలపతిరావు అందించిన సహకారం మరువలేనని సంతోషం వ్యక్తంచేశారు. టెంక చలపతిరావు మాట్లాడుతూ తన అభివృద్ధికి, ఎదుగుదలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

'రైతు ఉత్పత్తిదారుల కంపెనీలతో మేలు'



పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థలో మాట్లాడుతున్న విజయనగరం జిల్లాల నాబార్డు డీడీఎం నాగార్జున

బూర్జ: రైతు ఉత్పత్తి దారుల కంపెనీ వల్ల రైతులకు మేలు జరుగుతుందని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నాబార్డు డీడీఎంలు టి.నాగార్జున, రమేష్ కృష్ణ తెలియజేశారు. శుక్రవారం పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థలో రైతు ఉత్పత్తిదారుల కంపెనీల సీఈఓలు, అకౌంటెంట్‌లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీడీఎంలు మాట్లాడారు. పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ రైతు ఉత్పత్తి దారుల కంపెనీలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలతోపాటు చిన్న, సన్న కారు రైతులకు మార్కెటింగ్ సదుపాయాలతోపాటు గిడ్డంగి సదుపాయాలు, ఎరువులు, ఇన్‌పుట్ సదుపాయం అందుతాయన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం జిల్లాల ఎఫ్‌పీఓలు, ఏఎస్‌ఆర్‌లు, సీపీఎఫ్ ప్రతినిధులు, సీఈఓలు నూక అనూప్, బి.శంకరరావు, ఆర్ట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటిలో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్‌ఐ అప్పారావు

సారవకోట: మండలంలోని బుడితి జంక్షన్‌కు సమీపంలో ఉన్న పంచిరెడ్డి నారాయణరావు ఇంటిలో గురువారం దొంగలు పడ్డారు. నారాయణరావు తన భార్య లలిత ఇద్ద రు పిల్లలతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారు. ఆరుబయట ఉన్న మొక్కలకు నీళ్లు పోయాలని పక్కనున్న వారికి చెప్పడంతో వారు శుక్రవారం ఉదయం మొక్కలకు నీళ్లు పోసేందుకు వెళ్లగా ఇంట్లో ఫ్యాన్ తిరగడం గమనించి వెళ్లి చూశారు. తలుపుల తాళాలు పగలగొట్టి ఉండటం గుర్తించి స్థానిక జేసీఎస్ క న్వీనర్ నక్క తులసీదాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సారవకోట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఇంటిలో రూ.2 లక్షల వరకు నగదు, అరతులం సాయిబాబా ఉంగరం పోయినట్లు బాధితులు తెలిపారు. సారవకోట ఎస్‌ఐ అప్పారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. గత నెలలో బుడితి గ్రామంలో ఇలాగే దొంగతనం జరిగింది.

కిడ్నీ ఆస్పత్రిలో మరో ఆపరేషన్

కాశీబుగ్గ: పలాసలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్‌లో శుక్రవారం ఓ చిన్నారికి అపెండిక్స్ ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఆస్పత్రిలో కేవలం కిడ్నీ వ్యాధిగ్రస్తులకే కాకుండా అందరికీ సేవలు అందిస్తామని వైద్యులు చెబుతున్నారు. కాశీబుగ్గకు చెందిన పదేళ్ల లెనిన్ అనే బాలుడు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చాడు. వైద్య పరీక్షలు అనంతరం అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి ఉండటంతో ప్రముఖ సర్జన్లు డాక్టర్ కూర్మారావు, డాక్టర్ సురేష్‌లు సంయుక్తంగా అపెండిక్స్ పేగులో పేరుకుపోయిన వ్యర్థాన్ని ఆపరేషన్ చేసి తొలగించారు. దీంతో తీవ్రమైన కడుపు నొప్పి నుంచి చిన్నారి బయటపడ్డాడు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్ జరగడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ఏపీ డీఈఈ సెట్‌లో సత్తా చాటిన సాత్విక్



బగాన సాత్విక్

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 23వ వార్డు వెంకయ్యపేటకు చెందిన బగాన సాత్విక్ ఏపీ డీఈఈ సెట్‌లో బయాలజీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించినట్లు సాయిరాం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. బయాలజీ విభాగంలో 100 మార్కులకు గాను 73 మార్కులు సాధించి రెండో ర్యాంకు పొందాడు. విద్యార్థి తల్లిదండ్రులు అరుణ రామారావు ప్రభుత్వ ఉద్యోగులు.

సేవలు అమోఘం



సన్మాన గ్రహీతలతో ఎస్పీ రాధిక, అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు, విభాగానికి గుర్తుండిపోయేలా సేవలందించడం అమోఘమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగ విరమ ణ పొందిన స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐలు ఎస్.నారాయణ, కె.కృష్ణారావు, ఏఆర్ ఎస్ ఎస్. అప్పారావు, హెడ్ కానిస్టేబుల్ బి.వాసుదేవ్, కె.రాంబాబు లను ఎస్పీ వారి కుటుంబాలతో సహా ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

రిమ్స్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ



స్వామినాయుడును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వామినాయుడు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, వైద్యాధికారులు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ ఎల్.ప్రసన్నకుమార్, డాక్ట ర్ డి.పార్వతితో పాటు పలువురు వైద్యులు సత్కరించారు. అనంతరం స్వామి నాయుడు మాట్లాడు తూ వైద్యునిగా ప్రజా సేవ చేసే భాగ్యం కలగడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆ యన స్థానంలో డాక్టర్ ఉమామహేశ్వరరావును ప్రభుత్వం ఇన్‌చార్జిగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు పంపించింది. అయితే ఆయన ఆ బాధ్యత లు తీసుకోకుండా సెలవులో వెళ్లిపోయారు. దీంతో తర్వాత సీనియర్ వైద్యుడిని ఇన్‌చార్జిగా నియమించగా ఆయన సైతం బాధ్యతలు తీసుకోవడానికి ని రాకరించి సెలవుపై వెళ్లిపోయారు. ఇలా ఆరుగు రు వైద్యులు బాధ్యతలు తీసుకునేందుకు ఇష్టపడలేదు. దీంతో ఇన్‌చార్జి లేకుండానే జూన్ 1 నుంచి రిమ్స్ ఆస్పత్రి పనిచేసే పరిస్థితి ఏర్పడింది.

అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి: స్నేహపూర్వకమైన వాతావరణంలో క్రీడలు ఆడాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటములు సహజమనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఆదిత్య కళాశాల డైరెక్టర్ మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి సైలానీతో పాటు నిర్వాహకుడు ఎస్.లాల్‌బహదూర్ కళాశాల పీడీ లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కళాశాల క్రికెట్ మైదానంతో ఏసీఏ అనుసంధానానికి ఒప్పందం చేసుకునే విధంగా కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు సంప్రదింపులు చేశారు.

మొదటి రోజు తూర్పుగోదావరి జట్టు విజయం

అండర్-19 విభాగంలో మొదటి రోజు శ్రీకాకుళం-తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన 50 ఓవర్ల మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు విజ యం సాధించింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీకాకుళం జట్టు 41.4 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 39.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులతో విజయం సాధించింది.